నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

ఆదివారం 23 జులై 2023

1


## మంజీరకు తగ్గిన వరద ఉధృతి

**నవతెలంగాణ-బోధన్**

సాలూర మండల సమీపంలో గల మంజీర నదికి వరద ఉధృతి తగ్గింది. నీటమునిగిన రాతి వంతెన తేలింది. దీంతో రాతి వంతెనపై నుంచి మహారాష్ట్రకు వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతించడంతో రాకపోకలు ప్రారంభమైయ్యాయి.



తేలిన వంతెన.. రాకపోకలకు అనుమతి

## పాముకాటుతో తండ్రీకొడుకు మృతి

- వైద్య చికిత్స చేయించుకోకుండా కట్టు కట్టుకోవడంతో మృత్యువాత

**నవతెలంగాణ-రాజంపేట్**

మూఢనమ్మకం ఇద్దరి మృత్యువుకు దారితీసింది. పాటుకాటు వేయడంతో వెంటనే ఆస్పత్రికి వెళ్లకుండా కాటువేసిన వద్ద కట్టుకట్టుకొని వదిలేయడంతో తండ్రీకొడుకు మృతిచెందారు. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలంలోని షేర్‌శంకర్ తండాలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.






వివరాలు మెయిన్‌లో..


# ప్రాజెక్టులకు జలకళ

- ఎస్సారెస్పీకి 1.74 లక్షల క్యూసెక్కుల వరద
- 54 టీఎంసీలకు పెరిగిన నీటి సామర్థ్యం
- నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

**నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి**

నిజామాబాద్ జిల్లాతో పాటు ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని ప్రధాన సాగునీటి జలాశయాలు జలకళ సంతరించుకున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో కళ తప్పిన ప్రాజెక్టులు.. నిండుకుండలా మారుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో పంటలకు జీవనాధారమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, నిజాంసాగర్ ప్రాజెక్టులు నిండుతున్నాయి. ఎస్సారెస్పీలో ఏకంగా లక్షా 74 వేల క్యూసెక్కుల భారీ వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం 54 టీఎంసీలకు చేరుకుంది. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణ శాఖ పేర్కొంది.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గత మూడు రోజులుగా భారీగా వరద నీరు చేరుతోంది. ఎగువన మహారాష్ట్రలో కుండపోత వర్షాలతో లక్షల క్యూసెక్కుల వరద వచ్చి ప్రాజెక్టులోకి చేరుతోంది. సోమవారం వరకు ప్రాజెక్టులో కేవలం 29.509 టీఎంసీల నీరు ఉండగా.. ఐదు రోజుల వ్యవధిలో ప్రాజెక్టు నీటి సామర్థం 54.387 టీఎంసీలకు పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిస్థాయి 1080.70 ఫీట్లకు చేరింది. మహారాష్ట్రకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,74,995 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో నుంచి వస్తున్న వరదకు తోడు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కాళేశ్వరం రివర్స్ పంపింగ్‌ను నిలుపుదల చేశారు.

ఇక కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం 9.81 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 17.80 టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 29,300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శనివారం ఉదయం 39 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా.. సాయంత్రానికి కొత్త తగ్గింది. కళ్యాణి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. వరద గేట్ల ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సింగితం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.550 మీటర్లకు గాను ప్రస్తుతం నిండుకుండలా మారింది. ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం 416 మీట్లకు చేరింది.రిజర్వాయర్ నుంచి 916 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

జిల్లాలో మరో మూడు రోజుల పాటు వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. జిల్లాలో ఆది, సోమ వారాలు సాధారణం నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పాఠశాలలకు సెలవు పొడగించిన విషయం తెలిసిందే. శనివారం సైతం జిల్లాలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు.



నిండుకుండను తలపిస్తున్న ఎస్సారెస్పీ



నిజాంసాగర్‌లోకి వచ్చి చేరుతున్న వరద

## విద్యారంగ హామీలు నెరవేర్చాలి

- ఎస్ఎఫ్ఐ సమర భేరి జీపు యాత్ర ప్రారంభం
- జీపు యాత్రను జెండా ఊపి ప్రారంభించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి

**నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి**

సీఎం కేసీఆర్ విద్యారంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో 22-30వ తేదీ వరకు చేపట్టనున్న జీపుయాత్రను శనివారం న్యాల్‌కల్ రోడ్డులోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఎదుట జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం విద్యార్థుల ఆత్మా బలిదానాలతో ఏర్పాటు జరిగితే కేసీఆర్ ప్రభుత్వం విద్యార్థులు కలలు కన్నా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తానని, అందరికీ కామన్ విద్యా విధానం అందుబాటులోకి తెస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని జీపుయాత్ర ముఖ్య ఉద్దేశమని అన్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న రూ.5117 కోట్ల స్కాలర్షిప్లను , ఫీజు రీయింబర్స్‌మెంటస్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన మెస్ చార్జీల ధరలను అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నారు. మన ఊరు మనబడి పథకం కింద అన్ని పాఠశాలలను అభివృద్ధి చేయాలని విద్య రంగ బలోపేతం కోసం ఈ జీపు జాత జయప్రదం కావాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విగ్నేష్, అనిల్ జిల్లా, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు అరుణ్, నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, నాగరాజు జిల్లా సహాయ కార్యదర్శి శ్రీశైలం, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపిక, జిల్లా నాయకులు జవహర్, నాయకులు శివ, సంధ్య బాబురావు, నితిన్ ఆ తదితర నాయకులు పాల్గొన్నారు.

జెండా ఊపి సమర భేరి జీపు యాత్రను ప్రారంభిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి

## నేడు కామారెడ్డిలో జాబ్ మేళా

**నవతెలంగాణ-దోమకొండ**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో నేడు(ఆదివారం) ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే జాబ్‌మేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ అన్నారు. శనివారం దోమకొండ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గారి తనయుడు గంప శశాంక్ నిరుద్యోగ యువతీ యువకుల పట్ల ప్రత్యేక శ్రద్ధ నిర్వహించి కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల గ్రౌండ్లో 63 కంపెనీల ప్రతినిధులు పాల్గొనే జాబ్ మేళా కార్యక్రమంలో నిరుద్యోగ యువతీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందని తెలిపారు. ఇట్టి జాబ్ మేలను దోమకొండ మండలంలోని నిరుద్యోగ యువత యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సి డి సి చైర్మన్ ఐరేని నరసయ్య, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు అండెం శంకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యులు షమ్మీ తదితరులు పాల్గొన్నారు.

## టోల్ ప్లాజా మేనేజర్ పై దాడి.. కేసు నమోదు

**నవతెలంగాణ-భిక్కనూర్**

టోల్ ప్లాజా మేనేజర్ పై దాడి చేసి కర్రలతో బూతు అద్దాలను పగలగొట్టి సిబ్బందిపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి లోకల్ వాహనానికి టోల్ వసూలు చేయడంతో లోకల్ వాహనాలకు ఎలా డబ్బులు కట్ అవుతాయని టోల్ ప్లాజా వద్ద మేనేజర్‌ను భీమ్ రెడ్డి ప్రశ్నించారు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో భీమ్‌రెడ్డి కోపంతో మేనేజర్ పై దాడి చేసి బూతు అద్దాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని టోల్ ప్లాజా మేనేజర్ ఫిర్యాదు మేరకు భీమ్ రెడ్డి పై శనివారం కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

- కేజ్‌వీల్‌పై నుంచి పడటంతో తీవ్ర గాయాలు

**నవతెలంగాణ-సదాశివనగర్**

కేజీవీల్ తిరగబడటంతో తీవ్ర గాయాలపాలైన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని మర్కల్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేశ్ వివరాల ప్రకారం.. మర్కల్ గ్రామానికి చెందిన గుర్రపు రాజు (28) ఈ నెల19వ తేదీనా స్థానికంగా ఉన్న ఏనుగు రవీందర్‌రెడ్డి పొలంలో కేజివిల్‌తో దున్నుతుండగా ప్రమాదవశాత్తు బండిపై నుండి కిందపడగా అతడిపై నుంచి కేజీ విల్ వెళ్లడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కామారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.



రాజు

## ఆస్తి దక్కదేమోనని మహిళ ఆత్మహత్య

**నవతెలంగాణ-సదాశివనగర్**

తనకు ఆస్తి దక్కదేమోనని మనస్థాపానికి గురై మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని వజ్జపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేశ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాండ్ల లావణ్య(25) తండ్రి పేరుతో అనువంశికంగా వచ్చిన నాలుగు ఎకరాల భూమి ఉంది. ఇద్దరు అక్కచెల్లెలు, అన్న ముగ్గురు సమానంగా పంచుకోవాల్సి ఉండగా.. కాని మృతురాలి అక్క ఎవరికీ తెలియకుండా ఆమె పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఆ భూమి తనకు వస్తుందా లేదోనని మనస్థాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి అన్న గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.



లావణ్య

# ప్రజలకేం కావాలో అదే చేస్తా

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డితో కలిసి ఆర్టీసీ డిపో కోసం ఏర్పాట్లు పరిశీలన

**నవతెలంగాణ-భీమ్‌గల్**

'భీమ్‌గల్ ప్రాంత ప్రజల చిరకాల కోరిక ఆర్టీసీ డిపో పున్హ ప్రారంభం. కాంగ్రెస్ పార్టీ హయాంలో మూసివేసిన డిపోను కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభిస్తుంది. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి సహకారంతో డిపోను పున్హ ప్రారంభం చేయనున్నాం. కొందరు కావాలని డిపో విషయంలో, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలాంటి వారిని పట్టించుకోను. ప్రజలకు ఏమి కావాలో అదే చేస్తానని' మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. భీంగల్‌లో ఆర్టీసీ డిపో ఏర్పాటు కోసం ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి శుక్రవారం డిపోతో పాటు కొత్త బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. తాను మంత్రిగా నియోజకవర్గంలో వేసిన శిలాఫలకాలు చూసేందుకే వారికి రెండేండ్లు పడుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మరో మారు అధికారంలోకి రావడం ఖాయమని జోష్యం చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావును ఆపే దమ్ము ఎవరికి లేదని ధీమా వ్యక్తం చేశారు.



డిపో స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి వేముల, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి

## నిరసన తెలిపితే బూతులా..?

- బీజేపీ, హిందూ జేఏసీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఐద్వా

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

మణిపూర్‌లో మహిళలపై దారుణ ఘటన చోటుచేసుకోగా.. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేయగా.. సోషల్‌మీడియాలో తమను తిడుతూ బూతులు మాట్లాడిన బీజేపీ హిందూ జేఏసీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ విజయ్ బాబు కేసు నమోదు చేశారు. అనంతరం ఏసీపీని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలు, నాయకులు మహిళలను కించపరిచేటట్లు కామెంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. బిజెపి ఒకవైపు మహిళలను గౌరవిస్తామని బిజెపి పరిపాలనలో ఉన్న మణిపూర్లో దాడులు హత్యలు అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోకపోగా వాటికి వ్యతిరేకంగా మాట్లాడిన మహిళలను కూడా కించపరిచే విధంగా సోషల్ మీడియా ద్వారా మాట్లాడటం వారి నైజాన్ని బయటపెడుతుందని అన్నారు. ఇప్పటికైనా వారి మీద చర్యలు తీసుకొని కట్టడి చేయకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అనిత, సుజాత జిల్లా నాయకురాలు లావణ్య, కళావతి తదితరులతో పాటు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఐద్వా నాయకులు

# ఎట్టకేలకు డిగ్రీ కాలేజీ మంజూరు

- ప్రొసిడింగ్ ఉత్తర్వులు జారీ
- డిగ్రీ కాలేజీ డిమాండ్‌పై నవతెలంగాణలో వరుస కథనాలు

**నవతెలంగాణ-మద్నూర్**

జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే హామీ ఎట్టకేలకు నెరవేరింది. మద్నూర్ వాసుల ఏండ్ల నాటి కల సాకారమైంది. మద్నూర్ మండలానికి డిగ్రీ కాలేజీ మంజూరు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మద్నూర్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు డిమాండ్‌పై నవతెలంగాణలో వరుస కథనాలు వెలువరించిన విషయం విధితమే. తాజాగా ఈ నెల 16వ తేదీనా సైతం డిగ్రీ కాలేజీ మంజూరు అయ్యేనా అంటూ కథనం ప్రచురించడం పట్ల ప్రాధాన్యత సంతరించుకుంది.



మద్నూర్‌కు డిగ్రీ కాలేజ్ మంజూరయ్యేనా?

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల విద్యార్థుల ఏండ్ల నాటి కళ.. డిగ్రీ కళాశాల మంజూరు.. ఇప్పట్లో నెరవేరేనా ? అన్న ప్రశ్న తలెత్తుతోంది. దీనిపై ఇటీవల జూన్ 20వ తేదీన మద్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మద్నూర్ మండలంతో పాటు నియోజకవర్గంలోని జుక్కల్, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ మండల కేంద్రాలకు సెంటర్ లైటింగ్ కోసం మంజూరైన నిధులపై మాట్లాడి.. అదే రోజు మద్నూర్ మండల కేంద్రానికి 15 నుంచి 30 రోజుల్లో డిగ్రీ కళాశాల మంజూరు ఉత్తర్వులు వస్తాయని ఎమ్మెల్యే హనుమంతు షిండే

జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే స్పందించి ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా మద్నూర్ మండలానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయించి దాని ప్రొసిడింగ్ కాపీ ఉత్తర్వులు జారీ చేయించడంలో ప్రత్యేక కృషి చేశారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. దీనికి జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కృషి చేసినట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ మద్నూర్ ఉమ్మడి మండలంలోని ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు ఉపాధ్యాయులు గ్రామంలోని పెద్దలు వ్యాపారస్తులు యువకులు కలిసి శనివారం మద్నూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో ముందుగా ముఖ్యమంత్రి చిత్రపటానికి అలాగే ఎంపీ బీబీ పాటిల్ చిత్రపటానికి ఎమ్మెల్యే హనుమంతు సిండే చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట టపాకాయలు కాలుస్తూ పెద్ద ఎత్తున సంబరాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ ఉమ్మడి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు మద్నూరు గ్రామ సర్పంచ్ సురేష్, ఉపాధ్యక్షులు షేక్ గఫర్, మద్నూర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బన్సీ పటేల్, డోంగ్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శశాంక్ పాటిల్ మద్నూర్ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ పటేల్, మాజీ సింగిల్ విండో చైర్మన్ విజయ్, ఉమ్మడి మద్నూర్ మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ దిగంబరావ్ పాటిల్, మద్నూర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ బండి వార్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



టపాకాయలు పేలూస్తూ సంబరాలు చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు

## జీపీ కార్మికుల గోడు పట్టదా..?

- రాష్ట్ర ప్రభుత్వంతో జేఏసీ రాష్ట్ర నాయకుల చర్చలు విఫలం
- సమ్మెను మరింత ఉధృతం చేయాలి
- జీపీ కార్మికుల జేఏసీ జిల్లా చైర్మన్ వెంకట్ గౌడ్



మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్..

**నవతెలంగాణ-రాజంపేట్**

పంచాయతీ కార్మికులు తమ సమస్యను పరిష్కరించాలని గత 16 రోజులుగా తిండి నిద్రలు మానుకొని సమ్మెను నిర్వహిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా జేఏసీ చేర్మన్ వెంకట్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెలో శనివారం పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని 16 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులను ఈరోజు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, అధికారులతో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘాల రాష్ట్ర జేఏసీ నాయకులు చర్చలు జరిపారని తెలిపారు. సమ్మెను విరమించాలని మంత్రి కోరారని, కానీ హామీలతో సమ్మె విరమింప జేయబోమని జీవోలను తీసుకువచ్చి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసినట్టు తెలిపారు. కావున జిల్లాలో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెను మరింత ఉధృతంగా చేయాలని పిలుపునిచ్చారు. జూలై 27 న కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నా ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భద్రప్ప, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, కార్యదర్శి పడమటి సోపాన్ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### ఒంటికాలుపై నిలబడి నిరసన

**జుక్కల్ :** జీపీ కార్మికుల సమ్మె శనివారంతో 17వ రోజుకు చేరుకుంది. శనివారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, 51 జీవోను సవరించాలని కారోబార్లను కార్యదర్శులుగా ప్రమోట్ చయాలని డిమాండ్ చేశారు.



ఒంటికాలిపై నిలబడి నిరసన

## 'డబుల్' లబ్దిదారుల ఎంపిక

**నవతెలంగాణ-వేల్పూర్**

వేల్పూర్ మండల కేంద్రంలో పడగల గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం లబ్దిదారుల ఎంపిక శనివారం చేపట్టారు. రెండు స్లైటీల్లో లబ్దిదారుల ఎంపిక చేపట్టినట్టు అధికారులు తెలిపారు. మొదటగా గ్రామంలో వచ్చిన 250 దరఖాస్తులు మొత్తంగా ఇంటింటి సర్వే చేస్తూ వాళ్ళ సోషియో ఎకనామిక్ కండిషన్స్ మేము సర్వే ద్వారా తెలుసుకున్నారని వారి నుంచి నిరుపేదలైన యాభై ఒక్క మందిని మొదట ఎంపిక చేసినట్టు తెలిపారు. ఆర్థికంగా ఎంతో కొంత ఉన్న మిగిలిన 53 మందిని డ్రాకు ఎంపిక చేసినట్టు తెలిపారు. 53 మంది నుండి 45 రెండు పడకగదుల యూనిట్ల గాను డ్రా ద్వారా 45 మందిని ఎంపిక చేయడం జరిగింది. దీంతో 96 యూనిట్లగాను 96 మంది లబ్దిదారులను ఎంపిక పూర్తి చేసినట్టు తెలిపారు.



మాట్లాడుతున్న అధికారులు

## డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోకు సన్మానం



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ప్రముఖ వైద్యులు జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రమేష్ ఇటీవలే ఖమ్మంలో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా తెలంగాణ రాష్ట్ర అనిస్తీషియా వైద్యుల సంఘానికి అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా శనివారం పట్టణ సామాజిక సేవకులు పట్వారి తులసి కుమార్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, నా వంతు వైద్య సేవలు సహాయ, సహకారాలు జిల్లా ప్రజలకు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ ఎమ్మెల్యే రైతులకు స్పష్టమైన హామీనివ్వాలి

- 25వ రోజుకు రైతుల రిలే దీక్ష

నవతెలంగాణ-రెంజల్

రోడ్ల మరమ్మతులకు రూ.3.70 లక్షల వ్యయంతో నిధులు మంజూరు అయ్యాయని బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ ప్రకటించిన విషయం ఆనందించాల్సిన విషయమేనని, ఆయనే స్వయంగా దీక్షా స్థలానికి వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ముందు రైతులు నిర్వహిస్తున్న రిలే దీక్ష 25వ రోజుకు చేరుకుంది. రోడ్ల మరమ్మతులు పూర్తయ్యే వరకు నేటి నుంచి బ్రాహ్మణపల్లి రైతులు సైతం దీక్షలో కూర్చొనున్నారని వారు పేర్కొన్నారు.

## కవిత చేసిన అభివృద్ధి శూన్యం

- నిజామాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి



మాట్లాడుతున్న స్రవంతిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రస్తుత ఎమ్మెల్సీ కవిత ఎంపీగా ఉన్నప్పుడు, తండ్రి సీఎంగా ఉన్నప్పటికీ జిల్లాకు కవిత చేసిన అభివృద్ధి శూన్యమని నిజామాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి అన్నారు. మాధవ్‌నగర్ ఆర్‌ఓబీ పనులకు సంబంధించిన కాంట్రాక్టర్ ఎమ్మెల్సీ కవిత కమీషన్లకు భయపడి పారిపోయిన మాట వాస్తవం కాదా?, అవినీతి గురించి కవిత మాట్లాడటం దయ్యాలే వేదాలు వల్లించినట్టు ఉందని విమర్శించారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అర్వింద్ ఎంపీగా గెలిచిన తర్వాత కమీషన్లు లేకున్న కారణంగానే గోవింద్‌పేట్ ఆర్‌ఓబీ పనులు పూర్తయి బ్రిడ్జి ప్రారంభించుకున్నామని, మాధవ్‌నగర్, ఆర్మూర్, మామిడిపల్లి, అడవి మామిడిపల్లి పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. అర్సపల్లి ఆర్‌ఓబీకి సైతం రూ.137.5 కోట్లు మంజూరు చేయించుకున్న ఘనత అరవింద్‌కే దక్కుతుందని అన్నారు. ఎంపీ అరవింద్ తాను చేసిన అవినీతి గురించి రుజువు చేయాలని, లేకపోతే పూలాంగ్ చౌరస్తాలో ముక్కు నేలకు రాయలన్న వ్యాఖ్యల మీద ఆమె స్పందిస్తూ, ముందు దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానన్న సీఎం కేసీఆర్ తల నరుక్కోవాలని, నిజామాబాద్ ప్రజలకు కవిత చేసిన మోసాలకు పూలాంగ్ వాగులో దూకాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈడీ విడుదల చేసిన సప్లమెంటరీ చార్జిషీట్లో కవిత భర్త అనిల్ కుమార్ పేరు ఉందని, మీడియా సంస్థలు కూడా వీటిని ప్రసారం చేశాయని, అవినీతి చేసిన ప్రతి ఒక్కరూ జైలుకే వెళ్తారని ఎంపీ అర్వింద్ అన్నారని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసును ఈడీ విచారిస్తుందని, నిందితులు ఎవరైనా జైలుకు వెళ్లాల్సిందేనన్నారు. జిల్లాకు రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు అయితే భవన నిర్మాణాల పనులు కవిత ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కేంద్రీయ విద్యాలయాలకు భూములు ఇచ్చినట్టే ఇచ్చి గుంజుకున్నారని అన్నారు. రింగ్ రోడ్డుకు కేంద్రం సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద నిధులు మంజూరు చేస్తే, రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయని అదేవిధంగా స్పైస్ బోర్డు తానే తెచ్చానని కవిత చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అరవింద్ ఎంపీగా ఎన్నికైన తర్వాత 4 ఫిబ్రవరి 2020న నిజామాబాద్ కేంద్రంగా స్పైస్ బోర్డ్ రీజినల్ ఆఫీస్ కం ఎక్స్‌టెన్షన్ సెంటర్ మంజూరు చేశారన్న సంగతి కవిత గుర్తుపెట్టుకోవాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అర్వింద్‌ని వెంటాడి ఓడిస్తానన్న కవిత ఇప్పుడు మాటలు మార్చి, అరవింద్ మీద ఎవరు నిలబడ్డా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటామని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ చేసిన సర్వేలలో తాను ఓడిపోతున్నానన్న కారణంగానే అర్వింద్‌పై వేరే వారిని పోటీలో దించాలని చూస్తున్నారని, దమ్ముంటే కవిత అరవింద్‌పై పోటీ చేసి గెలవాలని అన్నారు. సమావేశంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పంచారెడ్డి ప్రవళిక, కార్పొరేటర్లు సౌజన్య, మమత, ఇందిరా, మహిళా మోర్చా నాయకురాలు వరలక్ష్మీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## క్షత్రియ పాఠశాలలో వ్యక్తిత్వ విలువలపై అవగాహన



ముఖ్య వక్తకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్‌లోని క్షత్రియ పాఠశాలలో ఉపాధ్యాయులందరికి వ్యక్తిత్వ విలువలు పెంపొందించుకొనేందుకు దోహదపడే అంశాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన బీహెచ్ఈఎల్ విశ్రాంత అదనపు జనరల్ మేనేజర్ రమేష్ పవార్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేసే ఉపాధ్యాయులు తమ వ్యక్తిత్వ విలువలను పెంపొందించుకుంటూ విద్యార్థుల మూర్తిమత్వంను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయులను అనుకరిస్తూ వారి విలువలను నేర్చుకుంటారని అన్నారు. క్షత్రియ విద్యాసంస్థల కోశాధికారి అల్జాపూర్ గంగాధర్ మాట్లాడుతూ విద్యతో పాటు సాంప్రదాయ, నైతిక విలువలను కూడా నేర్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ లక్ష్మి నరసింహ స్వామి, అనిల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## తపస్వి స్వచ్ఛంద సంస్థను సందర్శించిన కృష్ణవేణి విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల యాజమాన్యం తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థను శనివారం సందర్శించారు. అందులో భాగంగా అక్కడున్న పిల్లలకు వాళ్లకు అవసరమయ్యే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ మహమ్మద్ మిన్నజ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## సీఐగా పదోన్నతి పొందిన సాయినాథ్‌కు రెడ్డిక నాయకుల సత్కారం

నవతెలంగాణ-నవీపేట్

సీఐగా పదోన్నతి పొందిన సాయినాథ్‌కు రెడ్డికా నాయకులు శనివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబిసి రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు గుమ్ముల అశోక్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పంతుల అరుణ్ కుమార్, వైస్ ఎంపీపీ ఇందూరు హరీష్, ఎంపీటీసీ సాయిరెడ్డి, సర్పంచ్ ప్రవీణ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన సీఐకి సన్మానం

### మణిపూర్ ఘటన..

# మహిళా జాతికే అవమానం

- దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- మణిపూర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు



ఎడపల్లి : పోచారం గ్రామంలో మోడీ దిష్టిబొమ్మ దహనం



కమ్మర్‌పల్లి : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగికదాడి చేసిన ఘటన భారత మహిళ జాతికే అవమానమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ ఘటనపై శనివారం పలుచోట్ల పలు పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు.

**ఎడపల్లి :** మణిపూర్ ఘటన జరిగి రెండు నెలలు గడిచిపోయిన అక్కడ నిందితులపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ పీఓడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మండలంలోని పోచారం గ్రామంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.నాగమణి, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కే రవి మాట్లాడుతూ.. ఒకవైపు దేశంలో బీజేపీ ప్రభుత్వం బేటి పడావో బేటి బచావో అంటూ ప్రచారం చేస్తూ మరోవైపు సభ్య సమాజమే తలదించుకునేలా మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి హతమారుస్తుంటే పార్లమెంట్‌లో వీటి విషయంలో మాట్లాడాలని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తుంటే మోడీ ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని అన్నారు. దీన్ని బట్టి బీజేపీకి మహిళల పట్ల ఏ పాటి గౌరవముందో అర్థమవుతుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు కిష్టవ్వ, సరస్వతి, గంగవ్వ, సాయవ్వ, రాజన్న, వైస్ లక్ష్మణ్, పోశెట్టి, నరసన్న, శంకర్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

**డిచ్‌పల్లి :** మణిపూర్ గిరిజన మహిళలపై అత్యాచారం హత్యలను, అల్లర్లను, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రజాపంథా డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల సంయుక్త కార్యదర్శి మురళి మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో కుకీ తెగకు చెందిన ముగ్గురు గిరిజన మహిళలను వివస్త్రను చేసి, అమానుషంగా హింసిస్తూ, నగ్నంగా ఊరేగించి, సామూహిక హత్యాచారం చేసిన ఘటన ప్రపంచమే దిగ్భ్రాంతికి గురైందన్నారు. కార్యక్రమంలో రాజేందర్, లక్ష్మి, గంగాధర్, సుమన్, మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

**హింసను అరికట్టడంలో బీజేపీ విఫలం..**

**కంఠేశ్వర్ :** మణిపూర్ రాష్ట్రంలో కూకీ, మైతే తెగల మధ్య జరుగుతున్న హింసను అరికట్టేందుకు మణిపూర్ రాష్ట్ర, కేంద్ర బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు దారుణంగా విఫలం కావడం వల్లనే అక్కడ ప్రజలపై హింస జరుగుతుందని పలువురు నాయకులు ఆరోపించారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసకు నిరసనగా ఎంసీపీఐయు, బహుజన లెఫ్ట్ పార్టీ-బీఎల్‌పీ, బహుజన కమ్యూనిస్టు- బీసీపీ పార్టీల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసిన అనంతరం దండి వెంకట్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాల ముందే దాడులు, హత్యలు, అత్యాచారాలు, లూటీలు జరుగుతుంటే ప్రేక్షక పాత్ర పోషించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థతకు నిదర్శనంగా చెప్పవచ్చని దండి వెంకట్ విమర్శించారు. బీజేపీ నాయకులు చెపుతున్న డబుల్ ఇంజన్ ప్రభుత్వాల డొల్లతనం వెల్లడైందన్నారు. కార్యక్రమంలో బహుజన మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కన్వీనర్ మైత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**మోదీ, అమిత్ షా దిష్టిబొమ్మ దహనం..**

**కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలోని 63వ నెంబర్ జాతీయ రహదారిపై మణిపూర్ రాష్ట్రంలో కుకిజాతికి చెందిన గిరిజన మహిళలపై సామూహిక అత్యాచారం ఘటనను నిరసిస్తూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో హెూంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సంద ర్భంగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు సారా సురేష్ మాట్లాడుతూ.. మణిపూర్ లో కుకిజాతికి చెందిన ముగ్గురు గిరిజన మహిళల ను నగ్నంగా ఊరేగించి, మహిళలపై సామూహిక అత్యాచారం జరిపి 80 రోజులు కావస్తున్న నేటికి నిందితులను అరెస్టు చేయకపోవడం విచారకరమన్నారు. ఘటనకు బాధ్యులైన నిందితులను అరెస్టు చేసి కఠినాతి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9సంవత్సరాలు గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలను మర్చిపోయి, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ, రెండు మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రజలు పాలకులను ప్రశ్నించకుండా ఉండడానికే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మణిపూర్ ఘటన చూస్తుంటే మనకు అర్థం అవుతుందని పేర్కొన్నారు. మణిపూర్ ఘటనకు బాధ్యులైన వారందరిపై సరైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాపంథా మండల కార్యదర్శి బి.అశోక్, నాయకులు కిషన్, రాజేశ్వర్, మౌలానా, గంగాధర్, వి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధ మహిళలను చంపిన కేసులో వ్యక్తి అరెస్టు

- ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ వెల్లడి



నిందితుడిని పట్టించేందుకు సహకరించినందుకు ప్రవీణ్‌పవర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిరాయిత్‌నగర్‌లో ఈనెల 19 బుధవారం గాఢనిద్రలో ఉన్న ఇద్దరు వృద్ధ మహిళలను చంపిన కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్టు జిల్లా ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 18వ తేదీ రాత్రి జిరాయిత్‌నగర్ నివాసం ఉండే మగ్గిడి తోటగంగు, మగ్గిడి మంద రాజు భాయ్ వృద్ధ మహిళలకు చేపూర్ గ్రామానికి చెందిన బండ నడిపి గంగాధర్ తమ్ముడు వరస అవుతాడు. ఈయన పెద్ద కూతురుని మృతురాలు మగ్గిడి తోట గంగు కొడుకు అయిన తోట మైపాల్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. నేరస్తుడు తరచుగా మృతుల ఇంటికి వెళ్లినప్పుడు మృతుల ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను గమనించేవాడు. వారిద్దరిని చంపి వాటిని దొంగలించాలనే ఉద్దేశంతో ఇంట్లోని రోకలిబండతో తలపై బలంగా కొట్టి వారి ఒంటిపై ఉన్న సుమారుగా పది తులాల బంగారు ఆభరణాలను దొంగలించాడు. ఎటువంటి సాక్ష్యాలు దొరకకుండా ఇంట్లో నిప్పు పెట్టి అగ్ని ప్రమాదం వలన మృతులు చనిపోయినట్లుగా చిత్రీకరించాడు. పట్టణ ఓఎస్‌డీ ప్రభాకర్‌రావు, స్టేషన్‌హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు అనుమానితుల కాల్ డీటెయిల్స్ ఆధారంగా శనివారం చేపూర్ గ్రామంలో ఆయన ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని దొంగలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కేసును చాకచక్యంగా శోధించి నిందితుడిని అరెస్టు చేయడానికి కృషిచేసిన బాల్కొండ, కమ్మర్‌పల్లి ఎస్ఐలు గోపి, రాజశేఖర్, కానిస్టేబుళ్లు తిరుపతి, మల్లేష్, గంగాప్రసాద్, గోపి, శ్రీకాంత్ గౌడ్, ప్రసాద్, రాజేశ్వర్‌ను కమిషనర్ రివార్డులు ఇచ్చి అభినందించారు.

**ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం..**

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఇంచార్జ్ జిల్లా పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్లో శనివారం మాట్లాడుతూ ఎంతో పెద్దగా ఇండ్లను నిర్మించుకుంటున్న వారు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, గ్రామాలలోని ప్రధాన వీధులలో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దొంగతనాల నివారణకై పోలీసులకు సహకరించాలని అన్నారు. ఇద్దరూ వృద్ధ మహిళలను చంపిన కేసుల్లో నిందితుడిని పట్టించేందుకు సహకరించిన విద్య హైస్కూల్ కరస్పాండెంట్ ప్రవీణ్ పవర్‌ను సీపీ శాలువా, మెమెంటోతో సత్కరించారు. క్రమంలో ఓఎస్‌డీ ప్రభాకర్‌రావు, స్టేషన్‌హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పలు మండలాలకు కొత్త ఎస్ఐలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

**బోధన్‌టౌన్ ఎస్ఐగా పాండేరావు..**



**బోధన్‌టౌన్ :** బోధన్ టౌన్ నూతన ఎస్ఐగా పాండేరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. బోధన్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజలకు ఏమైన సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయనకు పలువురు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు.

**బోధన్ రూరల్ ఎస్ఐగా నాగనాథ్..**



**బోధన్ :** బోధన్ రూరల్ ఎస్ఐగా నాగనాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ నుంచి బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. బోధన్ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని నూతన ఎస్ఐ నాగనాథ్ తెలిపారు.

**మాక్లూర్ ఎస్ఐగా సుధీర్‌రావు..**



**మాక్లూర్ :** మాక్లూర్ నూతన ఎస్ఐగా సుధీర్‌రావు శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన జగిత్యాల జిల్లా నుంచి వచ్చారు. మాక్లూర్‌లో విధులు నిర్వహించిన ఎస్ఐగా యాదగిరిగౌడ్ నవీపేట్ మండల ఎస్ఐగా బదిలీపై వెళ్ళారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# జీపీ కార్మికులపై వివక్షా..?

- వారిని వెంటనే పర్మినెంట్ చేయాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్
- 17వ రోజుకు జీపీ కార్మికుల సమ్మె



మోపాల్ : కార్మికులతో కలిసి భిక్షాటన చేస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్



కోటగిరి : మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

**మోపాల్ :** సఫాయి కార్మికులపై ప్రభుత్వ వివక్షను వీడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. మోపాల్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆమె మద్దతు తెలిపారు. శనివారానికి సమ్మె 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు గత 17 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. మల్టీ పర్పస్ వల్ల కారోబార్, బిల్ కలెక్టర్ల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు, నిర్వహణకు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి నిత్యం కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 48ని తీసుకువచ్చి పాఠశాలలను, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు పనిభారాన్ని వేసింది తప్ప వేతనాలను చెల్లించడంలో ఇతర సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపడం లేదన్నారు. వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నందు శ్రీనివాస్, ప్రదీప్, మైపాల్, లక్ష్మి, రాజమణి, సాయమ్మ, పోచవ్వ, గంగవ్వ, పోశెట్టి, లక్ష్మి, సావిత్రి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

**ఆర్డర్ కాపీ వచ్చేదాకా.. సమ్మె ఆపేదేలే..**

**నవీపేట్ :** గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ ఆర్డర్ జీవో వచ్చేదాకా సమ్మె ఆపేది లేదంటూ నవీపేట్ మండల కేంద్రంలో పంచాయతీ సిబ్బంది 17వ రోజు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, సమ్మె డిమాండ్లను పరిష్కరించే దాకా సమ్మెను విరమించబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు లక్క గంగారం, నరేష్, ప్రేమ్‌లాల్ కార్మికుల పాల్గొన్నారు.

**మోకాళ్లపై నిలబడి నిరసన..**

**కోటగిరి :** గత 17 రోజుల నుంచి గ్రామపంచాయతీ కార్మికులు ఉద్యోగ భద్రత కల్పించాలని చేపట్టిన సమ్మెను కొనసాగుతోంది. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏశాల గంగాధర్, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ నాయకులు మల్కా పోశెట్టి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ మాట్లాడుతూ.. కోటగిరి ఉమ్మడి మండలంలోని 28 గ్రామాల గ్రామపంచాయతీ కార్మికులు గత 17 రోజుల నుంచి నిరవధికంగా సమ్మె నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం సానుకూల స్పందన లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ మండల నాయకులు, కార్మిక వర్గం నాయకులు రాజేశ్వరి, జాకీర్ హుస్సేన్, సుధాకర్, శివ శంకర్, కిరణ్, పోశెట్టి, సావిత్రి, స్వామి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఎడపల్లి :** మండల కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద చేపట్టిన పారిశుధ్య కార్మికుల సిబ్బంది నిరవధిక సమ్మె 17వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా అంబేద్కర్ చుట్టూ మానవహారం చేపట్టి నిరసన చేపట్టారు. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, మండల కన్వీనర్ గంగరాజు, మండల కో కన్వీనర్ సంతోష్, మండలాధ్యక్షులు రాజు, పండరి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి :** గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఖాజామొహినొద్దీన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని జేఏసీ నాయకులు సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.... గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్మికులు సంవత్సరాలుగా వెట్టి చాకిరి చేస్తున్నారన్నారు. అలాంటి కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పెడచెవిన పెట్టి, కార్మికుల సమ్మె విరమణకు కృషి చేయకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు సారా సురేష్, అశోక్, కిషన్, ఐఎఫ్‌టీయూ నాయకులు కొత్తపల్లి ఆశన్న గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పండ్లమొక్కల పెంపకానికి దరఖాస్తులు ఆహ్వానం

**నవతెలంగాణ-రాజంపేట్**

ఉద్యానవన శాఖ, ఉపాధి హామీ శాఖ ద్వారా 100 శాతం రాయితీతో రైతులకు వివిధ రకాల పండ్ల మొక్కలను అందజేస్తుందని ఎంపీడీవో బాలకిషన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 50 ఎకరాల వరకు సాగుచేసుకుందుటకు ప్రభుత్వం అనుమతించిందని, ఇందులో జామ, సపోటా, నిమ్మ,కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, ఆపిల్ బేర్, చింత 5 ఎకరాల వరకు సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. డ్రాగన్ ఫ్రూట్ అర ఎకరంలో సాగు చేసుకోవచ్చని, ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఉపాధి జాబ్ కార్డు,రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలతో ఉపాధి హామీ ఏపీవో భాస్కర్ కు అందజేయాలని సూచించారు. దరఖాస్తులు అందజేయుటకు చివరి తేది జులై 31 అని ఆయన పేర్కొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- **ఎంపీడీవో అనంతరావు**

**నవతెలంగాణ-భిక్కనూర్**

ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో అనంతరావు సూచించారు. శనివారం మండలంలోని అయ్యవారిపల్లి, సిద్ధ రామేశ్వర నగర్, భిక్కనూర్ పట్టణ కేంద్రాలలో పారిశుద్ధ పనులు పరిశీలించి, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి అందులో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రవీణ్ కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

# చివరి ఆయకట్టుకూ నీరందిస్తాం

- **ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్**
- **పోచారం ప్రాజెక్టు కాలువలకు నీటి విడుదల**

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్(లింగంపేట్)**


కలెక్టర్‌తో కలిసి పోచారం ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల వరప్రదాయిని అయిన పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తున్నామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు పంటల సాగు కోసం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలిసి నీటిని విడుదల చేశారు. అనంతరం ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టపై ఏర్పాటు చేసిన రేలింగ్‌ను జిల్లా కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. పోచారం ప్రాజెక్టు పర్యాటక కేంద్రం ఏర్పాటు, ప్రాజెక్టుకు కావాల్సిన మరమ్మతుల గురించి జిల్లా నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్ట్ నీటితో పూర్తిస్థాయిలో నిండిందని, ప్రాజెక్టు ఆయకట్టు క్రింద 90 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని, మిగతా భూముల అంట సాగు కోసం ప్రధాన కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఎల్లారెడ్డి నాగిరెడ్డిపేట మండలం పోచారం ప్రాజెక్టు రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం రైతు బీమా, రైతుబంధు, ఉచిత విద్యుత్, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. పోచారం ప్రాజెక్టు ఆధునీకీకరణ, ప్రధాన కాలువ మరమ్మత్తులు, తదితర పనుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అడిగిన వెంటనే మూడు కోట్ల రూపాయలు విడుదల చేశారని, ఈ నిధులతో ప్రాజెక్టుకు కావలసిన పనులు చేపట్టినట్టు తెలిపారు. పోచారం ప్రాజెక్టు ఆయకట్టు కింద 10,500 ఎకరాలలో అధికారికంగా పంటలు సాగవుతుండగా, పరోక్షంగా మరో పదివేల ఎకరాలలో లిఫ్టుల ద్వారా పంటలు సాగవుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు పంటల సాగు కోసం ఎకరానికి పదివేల రూపాయల రైతుబంధుతో పాటు, 24 గంటల ఉచిత విద్యుత్, రైతులకు సొసైటీల ద్వారా సకాలంలో ఎరువులను అందజేస్తూ వ్యవసాయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ పండగలా మార్చాడన్నారు. అనంతరం పోచారం రైతుల కోరిక మేరకు గ్రామంలోని 268, 269 సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ శిఖం భూములను జిల్లా కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ. ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ఎంపిపి దివిటీ రాజ్ దాస్, జెడ్పీటీసీ ఉమ్మన్న గారి మనోహర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ విజిత శ్రీనివాస్ రెడ్డి, ఎంపిటీసి వినీత దుర్గారెడ్డి, జిల్లా నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ విద్యావతి, ఈఈ మల్లేశం, డీఈ వెంకటేశ్వర్లు, మండల సర్పంచులు, ఎంపీటీసీలు, ఎల్లారెడ్డి, లింగంపేట్ మండలాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటనపై ఉపాధ్యాయుల నిరసన ర్యాలీ


ర్యాలీ చేపట్టి మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

**నవతెలంగాణ-మద్నూర్**

మణిపూర్ రాష్ట్రంలో మహిళలకు జరిగిన అవమానాలపై యావత్ భారతదేశం స్పందించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఉపాధ్యాయులు మండల కేంద్రంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ ఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాలు వెంటనే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ ఘటన దేశ ప్రజలకు అవమానపరిచిందని నిందితులకు కఠిన శిక్ష పడాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల నిరసన ర్యాలీకి గ్రామస్తులు మద్దతు తెలిపారు.

## సబ్ స్టేషన్ సిబ్బందిని రెగ్యులర్ చేసి జీతాలు పెంచిన ఘనత కేసీఆర్ దే


మాట్లాడుతున్న ఎంపీపీ

**నవతెలంగాణ-రామారెడ్డి**

సబ్ స్టేషన్లలో సిబ్బందిని రెగ్యులరైజేసీ, వారి జీతాలను పెంచి, వారి జీవితాల్లో వెలుగు నింపింది కేసీఆర్ కాదా అని ఎంపీపీ దశరథ్ రెడ్డి ప్రతిపక్ష పార్టీలను ప్రశ్నించారు. మండలంలోని పోసానిపేట్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను శనివారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 7 గంటల కరెంటును, రెండు విడతలుగా ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణలో రైతులకు, పరిశ్రమలకు 24 గంటల కరెంటు అందజేస్తున్న ఘనత కెసిఆర్ ప్రభుత్వానిదని అన్నారు. రైతులు అడగగానే కనెక్షన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేస్తుంది కేసీఆర్ ప్రభుత్వం కాదా అని అన్నారు. పోసానిపేట్ రెవిన్యూ పరిధిలో 120 కొత్త 25 హెచ్పి, 63 హెచ్పి ట్రాన్స్‌ఫార్మర్‌లను రైతులకు అందజేశామని, గతంలో 1500 బోరు కలెక్షన్లు ఉంటే, 500 బోర్ కలెక్షన్లను తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. ప్రతిపక్ష పార్టీలకు ఈ అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, నాయకులు బాపురెడ్డి, లింగారెడ్డి, తిరుపతి, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

# రాష్ట్రంలో కేసీఆర్ జనరంజక పాలన

- **రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

కేసిఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన పలువురు యూత్ సభ్యులు, కుల సంఘాల సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్టు నాయకులు తెలిపారు. శనివారం వేల్పూర్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.మంచి చేసే వారిని ఆదరించి.. మాటలు చెప్పేవారికి బుద్ధి చెప్పాలని హితవు పలికారు. కేసీఆర్ వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పై గ్రామాల్లో ప్రజలే ఆలోచన చేయాలన్నారు. ఇక నుండి మీరు నా కుటుంబ సభ్యులనీ, అన్ని సందర్భాల్లో మీకు తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పిప్పెర అనిల్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అవారి మురళి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

## నూతన వంతెన నిర్మిస్తాం

- **నవతెలంగాణ కథనానికి స్పందన**


వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

పోచారం గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వంతెన కూలిపోయే స్థితికి రావడంపై నవతెలంగాణలో కథనం ప్రచురించడంతో ఎంపీడీవో రాణి స్పందించారు. శనివారం వంతెనను పరిశీలించారు. గత వారం రోజుల కురుస్తున్న వర్షాలకు పోచారం గ్రామానికి వెళ్లే వంతెన పై నుండి వరద నీరు ప్రవహిస్తుంటే ఆ వరద ప్రభావానికి వంతెన కూలిపోయే స్థాయికి చేరినట్టు కథనం ప్రచురించిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రమాద స్థాయిలో ఉన్న ఈ వంతెనను సంబంధిత అధికారులకు నివేదిక పంపుతామని త్వరలోనే ఈ సమస్యను తీర్చే విధంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఎంపీడీవో వెంట ఎంపీఓ సూర్యకాంత్, పంచాయతీ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంలపై అవగాహన

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి మండలంలోని అన్నసాగర్ గ్రామంలో శనివారం అధికారులు ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు వేసే విధానంపై అవగాహన కలిగివుండలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు , పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు తగ్గేవరకు ఎరువులు, మందులను వాడొద్దు

- **ఎల్లారెడ్డి ఏడిఏ రత్న**

**నవతెలంగాణ-రామారెడ్డి/తాడ్వాయి**

వర్షాలు పూర్తిగా తగ్గే వరకు రైతులు పంట పొలాల్లో ఎలాంటి ఎరువులను, మందులను పిచికారి చేయొద్దని శనివారం ఎల్లారెడ్డి ఏడిఏ రత్న రైతులకు సూచించారు. మండలంలోని అన్నారం, పోసానిపేటలలో వరి నారుమడ్లను, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరుతడి పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలం వ్యవసాయ అధికారి సోమ హరీష్ కుమార్, రైతులు తదితరులు ఉన్నారు.


రామారెడ్డిలో పొలాలు పరిశీలిస్తున్న ఏడీఏ

**పంటల పరిశీలన**

**తాడ్వాయి :** తాడ్వాయి మండలంలోని సోమారం గ్రామంలో శనివారం మొక్కజొన్న, పత్తి , సోయబీన్ పంటలను మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక వర్షపాతం వల్ల ఉన్న మురుగు నీటిని వీలైనంత కాల్వల ద్వారా త్వరగా తీసివేయాలని రైతులకు సూచించారు. మొక్కజొన్నలో వర్షాలు తగ్గిన తర్వాత నీటిని తీయివేసి, ఎకరానికి 20 కిలోల యూరియా మ్యూరేట్ అఫ్ పోటాష్ 10 కిలోలు బూస్టర్ డోస్ గా వేసుకోవాలని సూచించారు. పత్తిలో నీరు నిల్వ వలన వేరుకుళ్ళు ఆశించి పత్తి లో మొక్కలు వడిలి పోయే అవకాశముందని, దీని నివారణకు నీటి కాల్వల ద్వారా తీసివేసి 3గ్రా కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందును ఒక లీటర్ నీటికి కలిపి మొక్క మొదళ్ల తడిచే విధంగా పోయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లిఖిత్ రెడ్డి, రైతులు సంతోష్ రెడ్డి, యాదగిరి,నవీన్,దశరత్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి కూలిన ఇండ్లు


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

మండలంలోని టికరం తండాలో గత రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షానికి బర్దవల్ భీమ్ సింగ్ అనే వ్యక్తి ఇండ్లు కూలినట్లు పంచాయతీ కార్యదర్శి పండరీ నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షం కురవడంతో కునా ఇండ్లు ఒక వైపు భాగంలో కూలిపోయిందని తెలిపారు. కూలిన ఇండ్లను పరిశీలించామని, ఉన్నతాదికారులకు నివేదిక పంపినట్టు తెలిపారు.

## కమ్యూనిటీ హాల్‌లకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఎనిమిదో వార్డులో శనివారం సగర, ఉప్పరి సంఘం, మంత్రిగూడెంలో కమ్యూనిటీ హాల్‌కు మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ భూమి పూజ నిర్వహించారు. ఒక కమ్యూనిటీ హాల్‌కు 5 లక్షల రూపాయలు చొప్పున ఎమ్మెల్యే సురేందర్ నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ భూదేవి శ్రీనివాస్, కో ఆప్షన్ నెంబర్ ఎడ్ల కిషన్, ఉప్పర సంఘం అధ్యక్షుడు నిమ్మ అశోక్ మరియు సభ్యులు మంత్రి గూడెం నాయకులు వినోద్, మహేష్, రాజలింగం, నారాయణ ,సాయిలు, రాజు, సిద్ధు, మేస్త్రిలు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి అండగా ఉంటా

- **ఎమ్మెల్యే జాజాల సురేందర్**

**నవతెలంగాణ-రాజంపేట్**

పాముకాటుతో మృతి చెందిన మృతుని కుటుంబానికి అండగా ఉంటానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు. మండల శేర్ శంకర్ తండాకి చెందిన తండ్రి కొడుకులు ముద్రిచ రవి (35), అతని కుమారుడు వినోద్ (12) శుక్రవారం రాత్రి ఇంట్లో పడుకున్న సమయంలో పాముకాటు వేయడంతో మరణించిన సమాచారం అందిన వెంటనే వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియ ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి తానున్నానని ధైర్యం చెప్పి ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే గారి వెంట మండల బిఆర్ఎస్ నాయకులు ఎంపీపీ లింగాల స్వరూప కృష్ణమూర్తి, జెడ్పీటీసీ కొండ హనుమాన్లు , ఎంపీటీసీ సాగర్, పెంటి, సర్పంచులు గ్రామస్తులు ఉన్నారు.

**మృతుని కుటుంబానికి మదన్ మోహన్ భరోసా**

మండలంలోని శేర్ శంకర్ తండా గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు ముద్రిచ రవి, అతని కుమారుడు వినోద్ ఇంట్లో పడుకున్న సమయంలో పాముకాటు వేయడంతో మరణించిన విషయం తెలుసుకున్న మదన్ మోహన్ శనివారం స్థానిక నాయకుల ద్వారా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఇట్టి కార్యక్రమంలో సాయిలు, బాలెందర్, శ్రీధర్, సాయిలు, సారిలాల్, బన్సీ, సుభాష్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, ప్రకాష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల

## సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి

**నవతెలంగాణ-రాజంపేట్**

సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతి గ్రామంలో చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బాల కిషన్ సూచించారు. మండలంలోని తలమడ్ల గ్రామంలో వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నీరు నిల్వ ఉండకుండా లోతట్టు ప్రాంతాల్లో శనివారం బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేశారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో గ్రామ సర్పంచ్ యాదవ రెడ్డి కార్యదర్శి వంశీ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సౌకర్యార్థం బోరుమోటార్లు


తాగునీటి కోసం సింగిల్ ఫేజ్ బోర్‌మోటార్ ప్రారంభం

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

మండల కేంద్రంలో పాత మజీద్ ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే నిధుల ద్వారా సింగిల్ ఫేస్ బోరు మోటర్లు ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ తిరుమలరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే హనుమాన్ సిండే కృషి వల్ల గ్రామంలోని పలు వీధుల్లో నీటి సమస్య ఉండడంతో గ్రామస్తులు నా దృష్టికి తీసుకురాగా దీనిపై ఎంపీపీ తో చర్చించగా తక్షణమే స్పందించి సిడిపి ఒక నిధుల ద్వారా లక్ష రూపాయలు నిధులు ద్వారా మంచినీటి బోరు ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. .ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తమ మంచినీటి సమస్యను తీర్చడానికి కృషి చేసిన సర్పంచ్ తిరుమలరెడ్డి, ఎంపీపీ ప్రతాప్ రెడ్డి,కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన రోడ్డు విస్తరణ

- **గుంతల రోడ్డుతో వాహనదారులకు ఇక్కట్లు**

**నవతెలంగాణ-ముప్కాల్**

ఒకవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ రోడ్డు విస్తరణ పనులు కొనసాగిస్తుంటే ఒకవైపు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, మరోవైపు అధికారుల అలసత్వం కారణంగా రోడ్డు పనుల్లో నాణ్యత కరువైంది. ముప్కాల్ మండల కేంద్రంలో అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డు విస్తరణ పనులు నెమ్మదిగా సాగుతుండడంతో స్థానిక మండల వాసులు, వాహనదారులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసిన తర్వాత రోడ్డు మధ్యలో డివైడర్ పనులు పూర్తి చెయ్యాలి. కానీ అందుకు భిన్నంగా రోడ్డు పనులు సాగుతున్నాయి. ముందుగా రోడ్డు మధ్యలో డివైడర్ పనులు మొదలు పెట్టారు. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల గుంతలు ఏర్పడడంతో తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. కంకర తేలడంతో రోడ్డుపై వెళ్తున్న సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక మండల కేంద్రానికి చెందిన వాటర్ పోశెట్టి అతని భార్య రోడ్డుపై వెళుతున్నప్పుడు ప్రమాదం జరిగి ఆమె చెయ్యి విరిగింది. అదేవిధంగా బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఇద్దరు ప్రయాణికులు తమ పని నిమిత్తం మండల కేంద్రానికి రాగా గుంతలు ఏర్పడక ప్రమాదానికి గురయ్యారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నట్లు మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతలు ఉన్న చోట్ల సేఫ్టీ యాంగిల్స్ పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు. ఒకవైపు రోడ్డు, మరోవైపు కంకర పోసి వుండడం, దానికి తోడు ఈ వర్షాలు తొడవ్వడంతో రోడ్డు పనుల్లో ఇబ్బందులు తలెత్తాయి. ఇకనైనా అధికారులు మొద్దునిద్ర నుంచి మేల్కొని రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన రోడ్డు

## ఉత్తునూరులో కూలిన ఇల్లు

**నవతెలంగాణ-సదాశివనగర్**

గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తడిసి సదాశివనగర్ మండలం ఉత్తునూరు గ్రామానికి చెందిన బొంబోతుల ఈశ్వర్ గౌడ్ ఇల్లు శనివారం ఉదయం కూలిపోయింది. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ఈవిషయం తెలిసిన సంఘటన స్థాలనికి సర్పంచ్ మోతె సాయవ్వ ,ఉపసర్పంచ్ శివపాటీల్ , ఎం.పి.టి.సి చందర్ రావు , కార్యదర్శి దేవిసింగ్ , బి.ఆర్. యస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ ,శ్రీ కాంత్ , రాజు పరిశీలించారు. అంతవరకు హైస్కూల్‌లో ఆయన కుటుంబం ఉండేందుకు తాత్కాలికంగా ఏర్పాట్లు చేశారు.

## ఇంటింటికీ మొక్కలు పంపిణీ

**నవతెలంగాణ-ఏర్గట్ల**

రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 7వ హరితహారంలో భాగంగా నాగేంద్రనగర్ సర్పంచ్ మంజుల బాలాజీగౌడ్ ఇంటింటికీ ఆరు మొక్కలను శనివారం పంపిణీ చేశారు. అనంతరం చెట్ల పెంపకం, వాటి ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రదీప్ గౌడ్, పంచాయతీ సిబ్బంది, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

## నష్టపోయిన పంటలను పరిశీలించిన బీజేపీ నాయకులు

**నవతెలంగాణ-బోధన్**

గత నాలుగు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలతో అమ్దాపూర్ గ్రామంలో నష్టపోయిన పంటలను, కూలిపోయిన ఇండ్లను బీజేపీ రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ వర్షానికి ఇండ్లు శిథిలావస్థకు చేరడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. భారీ వర్షాలతో నష్టపోయిన పంటలకు, వర్షాలకు కూలిపోయిన ఇండ్లకు తక్షణమే ప్రభుత్వం నష్టపరిహారం మంజూరి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ విఠల్, బీజేపీ సీనియర్ నాయకులు సుధాకర్ చారీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్టుతో సంబంధంలేని వారి మాటలు నమ్మి మోసపోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న భూపతి రాజు

**నవతెలంగాణ-ఆర్మూర్**

ట్రస్టుతో సంబంధం లేని వారి మాటలు నమ్మి మోసపోవద్దని తెలంగాణ రాష్ట్ర మహా పిరమిడ్ సేవ అధ్యక్షులు భూపతి రాజు తెలిపారు. పట్టణంలోని పీఎస్ఎస్ఎమ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతానికి చెందిన మీనుగు రణవీర్, ఆయన భార్య మేనుగు స్వప్నలకు పీఎస్ఎస్ఎం సొసైటీకి, పీఎంసీ, పత్రీజీ ధ్యానానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. సమావేశంలో శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రం చైర్మన్ ఏనుగు తిరుమల గంగారం, పిరమిడ్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కూడాని అంజయ్య, అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సుఖాల లక్ష్మణ్, రిటైర్డ్ రైల్వే సూపరింటెండెంట్ సాయిబాబా, కూనింటి శేఖర్‌రెడ్డి, చిదుర రాజు అమరవజి శ్రీనివాస్, నిశాంతు, సంతోష్‌కుమార్, సతీష్, రాజారామ్, నారాయణ, గంగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళా పేరుతో నిరుద్యోగులను అవమానించిన ఎమ్మెల్సీ

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

**నవతెలంగాణ-కంఠేశ్వర్**


జాబ్ మేళా పేరుతో జిల్లాలోని నిరుద్యోగులను ఎమ్మెల్సీ కవిత అవమానించారని కాంగ్రెస్ కమిటీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం కాంగ్రెస్ జిల్లా భవన్‌లో పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్ మేళా పేరుతో నిరుద్యోగులను అపహాస్యం చేశారని తెలిపారు. కవిత మాట్లాడుతూ జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చినందుకు సంతోషపడుతున్నానని అనడం ఆమె తల బిరుసో లేక అజ్ఞానమో అర్థం కావడంలేదని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజా ప్రతినిధులు ఎక్కడైనా నిరుద్యోగులు ఉండకూడదని కోరుకుంటారని, కానీ కవిత అందుకు భిన్నంగా జిల్లాలో పెరుగుతున్న నిరుద్యోగ యువతను చూసి సంబరపడిపోతున్నారని ఆయన అన్నారు. అసలు ప్రారంభమే కానీ ఐటీ హబ్ పేరుతో జాబ్ మేళా నిర్వహించడమే హాస్యాస్పదమని దానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కవిత హాజరై మాట్లాడిన తీరు సగటు నిరుద్యోగిని మనోవేదనకు గురిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. జాబ్ మేళా పేరుతో ప్రకటనలతో ఊదరగొట్టారు తప్ప నిజానికి పదివేల మంది జాబ్ మేళాకు హాజరైతే కేవలం 750 మందికి ఉద్యోగాలు ఇచ్చి మిగిలిన వారి రెస్యూమ్‌లు తీసుకొని చేతులు దులుపుకున్నారని అన్నారు. అసలు జాబ్ మేళాలో పాల్గొన్న కంపెనీల వివరాలు గానీ, ఆ కంపెనీలు ఎంత వేతనంతో ఉద్యోగులను ఎంపిక చేశారో వారు ఎన్ని సంవత్సరాల అగ్రిమెంట్‌తో ఉద్యోగాలు ఇచ్చారో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని ఆయన అన్నారు. 750 ఉద్యోగాలకు 10,000 మంది నిరుద్యోగులు హాజరయ్యారంటే జిల్లాలో నిరుద్యోగులు ఎ దుస్థితిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మూర్తి గోపి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు విక్కీ యాదవ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15న ప్రతిభా పురస్కారాలు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పైబడిన కోర్సులలో విద్యార్థినీలు 80 శాతానికిపైగా మార్కులు పొందిన వారికి తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్టు వంజరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాస్టర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అర్హులు సుభాష్‌నగర్ కార్యాలయంలో ఈనెల 31 లోపు తమ మార్కుల మెమో, బయోడేటాను అందజేయాలని, ఎంపికైన వారికి పురస్కారాలు అందజేస్తామన్నారు. వివరాలకు 9848490055, 98493 91493 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. నిజామాబాద్ ప్రతినిధులు కాలేరు గడ్డం శ్రీనివాస్, గోపాల శ్రీనివాస్ (అయ్యప్ప శ్రీను), మయావర్ సాయిరాం, పటేరు రాజు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కానుకంటి శివప్రసాద్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు



ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ సాలూర మండల నాయకులు

**నవతెలంగాణ-బోధన్**

సాలూర బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, కార్యదర్శి సుదర్శన్, డీసీసీబీ డైరెక్టర్ శరత్ తదితరులు ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సహకారంతో ఎమ్మెల్సీ కవితను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోధన్ ఉమ్మడి మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరి చేయాలని వారు ఆమెను కోరారు. దాంతో ఎమ్మెల్సీ కవిత సానుకూలంగా స్పందించి నిధుల మంజూరికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

# నిజాంను ఎదురిస్తూ రచనలు

- తెలంగాణ విముక్తి కోసం కృషి చేసిన మహానీయుడు దాశరథి కృష్ణమాచార్య
- జయంతి సందర్భంగా నివాళి

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/సిరికొండ**

తెలంగాణ విముక్తి కోసం కృషి చేసిన మహానీయుడు దాశరథి కృష్ణమాచార్య అని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని గర్వంగా ప్రకటించినా వ్యక్తి అని కొనియాడారు. దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా జెడ్పీ కార్యాలయంలోని జెడ్పీ ఛాంబర్‌లో దాశరథి కృష్ణమాచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఇంగ్లీషు సాహిత్యంలో బి.ఎ చదివి, సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడని తెలిపారు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించారని వివరించారు. హైదరాబాద్ సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నారని, నిజాం ప్రభువును ఎదిరిస్తూ రచనలు చేశాడని తెలిపారు. కార్యాలయంలో జెడ్పీ సీఈవో గోవింద్, డిప్యూటీ సీఈఓ సుందర వరద రాజన్, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుదర్శనం, జెడ్పీ కార్యాలయ పర్యవేక్షక సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ శంకర్, నీలం రెడ్డి, మనోహర్ రావు పాల్గొన్నారు.



నిజామాబాద్ సిటీ : నివాళి అర్పిస్తున్న పలువురు

**గ్రంథాలయంలో దాశరథి జయంతి..**

**నిజామాబాద్ సిటీ** :జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తెలంగాణా కవి దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ దాశరథి సామాజిక స్పృహ కలిగించే చాల రచనలు, సినిమా పాటలు రచించారని, నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ బి.తారకం, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సి.రాజేశ్వర్, సిబ్బంది యల్.శ్రీనివాస్, సంపత్‌కుమార్, అభిలాష్, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

**తెలంగాణ అభినవ వైతాళికుడు దాశరథి..**

**సిరికొండ** : తెలంగాణ సాహిత్య పూదోటలో విరబూసిన దాశరథి కృష్ణమాచార్యులు, మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తన సాహిత్యంతో ప్రజలను చైతన్య పరిచిన తెలంగాణ అభినవ వైతాళికుడు అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అన్నారు. తెలంగాణ కవి, రచయిత నిజాం నిరంకుశ పాలనపై కళాన్ని, గళాన్ని ఎక్కుపెట్టిన పోరు కెరటం దాశరథి కృష్ణమాచార్య 98వ జయంతిని శనివారం సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించారు. మొదటగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య దాశరథి చిత్రపటానికి పూలమాలనలంకరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదమరిస్తే.. అంతే సంగతి



ఘన్‌పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద రహదారిపై గుంతలలో నీరు

**నవతెలంగాణ-బోధన్**

మండలంలోని ఘన్‌పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద, నాగన్‌పల్లి వద్ద రహదారి గత కొన్నేండ్ల నుంచి పూర్తిగా గుంతలమయంగా మారింది. దాంతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు సైతం గురయ్యారు. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అడుగడుగునా భారీ గుంతలు ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ ప్రయాణించే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారి మరింత ధ్వంసం కావడంతో వర్షపు నీరు ఆ గుంతలలో నిండిపోయింది. దాంతో వర్షపు నీటితో గుంతలు ఏర్పడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఘన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద గతంలో ఈ గుంతల కారణంగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని గుంతలు పూడ్చి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## కోటగిరిలో అత్యధిక వర్షపాతం నమోదు

**నవతెలంగాణ-బోధన్**

బోధన్ డివిజన్‌లో కోటగిరి మండలంలో 79.6 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదయినట్టు ఆర్డీఓ కార్యాలయాధికారి ముంతాజుద్దీన్ వెల్లడించారు. ఎడపల్లి-74.4, పోతంగల్ 57.8, రుద్రూర్-32.2, వర్ని-44.6, రెంజల్-23.6, మోస్రా-16.2, చందూర్-16.8, బోధన్ 9.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు ఆయన తెలిపారు.

## కుర్నాపల్లిలో డ్రైడే

**నవతెలంగాణ-ఎడపల్లి**

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కుర్నాపల్లి గ్రామంలో గల ఆరోగ్య ఉపకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వెలుగు ఇన్చార్జి వైద్యాధికారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రై డే లార్వా సర్వేపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య వైద్య సిబ్బందితోపాటు ఆశావర్కర్లతో కలిసి గ్రామాలలోని ప్రధాన వీధులలో డ్రైడే లార్వాపై ప్రజలకు సలహాలు సూచనలు అందజేశారు.

## అదనపు కలెక్టర్‌కు పలువురు సన్మానం

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్/డిచ్‌పల్లి**

నూతనంగా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన యాదిరెడ్డి శనివారం జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల బోకేను అందజేశారు.

**అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డికి సన్మానం..**

**కంఠేశ్వర్** :నూతన అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన యాదిరెడ్డిని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శాలువా, పూల బొకేతో సన్మానించారు. ఈ సందర్భంగా అర్సపల్లిలో గల గంగపుత్ర సొసైటీ స్థలం యందు గంగపుత్రులకు మంజూరు చేసిన హెూల్‌సేల్ మార్కెట్ కోల్డ్ స్టోరేజ్ భవనాలకు మంజూరైన 2 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షులు పల్లికొండ అన్నయ్య, న్యాయ సలహాదారులు దుబ్బాక రవి, గంగపుత్ర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, డీసీసీబీ డైరెక్టర్ ఆనంద్, ఎంపీటీసీ బాలగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : అడిషనల్ కలెక్టర్‌కు సన్మానం

**అడిషనల్ కలెక్టర్‌కు, నూతన ఎస్ఐకి సన్మానం..**

**డిచ్‌పల్లి** : నిజామాబాద్ జిల్లాకు నూతనంగా వచ్చి బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి, ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సిలివేరి మహేష్‌కు ఇందల్‌వాయి సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు లోలం సత్యనారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పూలబోకేను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. గతంలో నిజామాబాద్ డివిజన్ ఆర్డీఓగా విధులు నిర్వహించిన యాదిరెడ్డి నిజామాబాద్ జిల్లాకు అడిషనల్ కలెక్టర్ హెూదాలో వచ్చారని తెలిపారు. ఎస్ఐ సిలివేరి మహేష్ నూతనంగా బాధ్యతలు స్వీకరించడం పట్ల సన్మానించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు మోహన్‌నాయక్, తేలు విజయ్‌కుమార్, కుమార్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు చిలువేరి గంగాదాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు బీరిష్‌శెట్టి, అరటి రఘు, సీహెచ్ దాస్, లక్ష్మారెడ్డి, చందర్‌నాయక్, సామాజిక కార్యకర్త పులిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన నాయకులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

గత నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని సంతోష్‌నగర్‌లో గల లోతట్టు ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆదేశానుసారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖాందేశ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. పట్టణంలోని సంతోష్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షంలోనే ప్రజల సమస్యల తెలుసుకోవడానికి వెళ్లారు. అలాగే పక్కన గల నిజాంసాగర్ కెనాల్ వద్ద పరిస్థితిని గమనించి వెంటనే మున్సిపల్ అధికారులకు విన్నవించారు. జేసీబీ ద్వారా నీళ్ల ఇండ్లలోకి రాకుండా అడ్డుకట్ట వేయించినట్టు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు ఖాందేష్ సత్యం, మక్కల సాయినాథ్, నరేష్, మేతాబ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలతోనే ఆర్థిక సాధికారత సాధ్యం

- ఏపీఎం కుంట గంగాధర్

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

స్వయం సహాయక సంఘ సభ్యులైన మహిళలతోనే ఆర్థిక సాధికారత సాధ్యమవుతుందని ఏపీఎం కుంట గంగాధర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన ఝాన్సీ గ్రామ సమాఖ్య వార్షిక మహాజన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకప్పుడు మహిళా సంఘాలకు రూ.10వేలు మాత్రమే రుణంగా ఇచ్చేవారని, కానీ ఇప్పుడు 10 లక్షల నుంచి 20లక్షల వరకు రుణాలు అందిస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాలకు ఇస్తున్న ఈ రుణాలను ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలని తద్వారా ప్రతి మహిళ ఆర్థికంగా సాధికారత సాధించాలని కోరారు. ప్రతి కుటుంబంలో మహిళలు క్రమశిక్షణతో ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తారని, ఇందుకు అవసరమైన రుణ సహాయాన్ని సెర్ప్ ఐకేపీ సంస్థ ద్వారా అందిస్తున్నట్టు తెలిపారు. మారుతున్న కాలంతోపాటు కొత్త కొత్త ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ఏర్పాటుకు మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీడీలు చుట్టే పని నుంచి క్రమంగా మహిళలు బయటకు వచ్చి మగ్గం వర్క్, ఆహార శుద్ధి కార్యక్రమాల వంటి కొత్త పనులకు రుణాలు తీసుకొని ఆదాయ వృద్ధి సాధించాలని సూచించారు. ప్రతి నెలకు ఒక సభ్యురాలు చొప్పున బ్యాంకుకు వెళ్లి వాయిదాలు చెల్లించే పద్ధతి వల్లనే మహిళా సంఘాల్లో ఆర్థిక క్రమశిక్షణ కొనసాగుతోందని అన్నారు. ప్రతి ఒక్క సంఘం ఇదే పద్ధతిని ఇకముందు కూడా కొనసాగించాలని సూచించారు. ఆహార శుద్ధి పరిశ్రమ ఏర్పాటు చేసే వారికి 35 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రుణాలు అందిస్తుందని గుర్తు చేశారు. అర్హులైన వారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సీసీ రవికుమార్, సీసీలు అలేఖ్య, గ్రామ సమాఖ్య పాలకవర్గ సభ్యులు ఎం.లక్ష్మి, లలిత, సుమలత, సిహెచ్.లక్ష్మి, సమ్రీన్, వీవోఏలు మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం కుంట గంగాధర్

## ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

కేజీబీవీ రిక్రూట్‌మెంట్ ఆన్‌లైన్ పరీక్ష 2023 కొరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న మహిళా అభ్యర్థులు వెబ్‌సైట్ schooledu.telangana.gov.in హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్వీ దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్‌లో సూచించిన పరీక్షా కేంద్రానికి ఈనెల 24, 25, 26 తేదీల్లో హాజరు కావాలని, మహిళా అభ్యర్థులు ఇతర వివరాలకు 6305616256, 9177421285 నెంబర్‌లకు సంప్రదించాలని సూచించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ నాయకులు

**నవతెలంగాణ-బోధన్ టౌన్**

బోధన్ పట్టణానికి చెందిన గాయత్రి టెక్స్‌టైల్ యజమాని కుమారుడు రోడ్డు ప్రమాదంలో గత ఐదు రోజుల క్రితం మరణించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం కనీసం పెన్షన్ ఇవ్వడం లేదు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

హమాలీల పోషణ కోసం ప్రభుత్వం కనీసం పెన్షన్ ఇవ్వడం లేదని ఐఎఫ్‌టీయూ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.శివకుమార్ అన్నారు. ఐఎఫ్‌టీయూ (ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్) ఆధ్వర్యంలో లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్) ఏసీఎల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎం.శివకుమార్ మాట్లాడుతూ.. కరోనా కాలంలో సైతం హమాలీ కార్మికులు ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలక భూమిక నిర్వహించారని, హమాలీ కార్మికులు సరుకుల రవాణాలో నేటికీ ముఖ్యపాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరు లేకపోతే ఇప్పుడున్న వ్యవస్థ ముందుకు సాగడం కష్టమని తెలిపారు. 40 ఏండ్లు దాటితే పనిచేయడం కష్టం అయినప్పటికీ బతుకుదెరువు కోసం పనిచేస్తూనే ఉంటారని వివరించారు. వారి పోషణ కోసం ప్రభుత్వం కనీసం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ జిల్లా అధ్యక్షులు మోహన్, రాజు, గంగాధర్, శంకర్, అబ్దుల్, సాయిలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## ఈవీఎంలపై గ్రామస్తులకు అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారి

**నవతెలంగాణ-నందిపేట్**

మండలంలోని చౌడమ్మ కొండూరు గ్రామంలో శనివారం ఈవీఎంలపై ఏఎస్ఓ యశ్వంత్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంలపై అందరికీ అవగాహన లేకపోవడంతో వారికి అవగాహన కల్పించి తమ తమ ఓట్లు ఎలా వేయాలో వివరించినట్టు చెప్పారు. ఈవీఎంపై ఉన్న నోటా గురించి కూడా వివరించామన్నారు. కార్యక్రమంలో కొండూరు గ్రామప్రజలు పాల్గొన్నారు.

## బాల్కొండలో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డిని టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సునీల్ కుమార్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో వేణుగోపాల్ యాదవ్ హైదరాబాద్‌లో తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా కలసి కట్టుగా పనిచేసే విధంగా కృషి చేద్దామని ఈ సందర్భంగా సునీల్ కుమార్ పేర్కొన్నట్లు వేణు గోపాల్ యాదవ్ తెలిపారు.

